విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 24, జనవరి 2025

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

విశాలాంధ్ర – నంద్యాల అర్బన్: శాసనసభ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పరచాలని, గ్రామాలలో ఉన్న అర్హులైన పేదలకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు, పట్టణ ప్రాంతాలలో ఉన్న అర్హులైన పేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించి ప్రభుత్వమే నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ముఖ్యుల సమావేశం జి.లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని మాట్లాడుతూ ప్రధానంగా ఎన్నికలలో ముఖ్యమైన హామీ అయినా విద్యుత్ చార్జీలను ఎట్టి పరిస్థితులలోనూ పెంచబోమని ఒకవేళ

పెంచినా ప్రభుత్వం భరిస్తుందని కూటమి ప్రభుత్వం బహిరంగంగా ఎన్నికల సభలలో హామీ ఇచ్చారు. కాగా గత వైఎస్ఆర్సీపి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించి ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిందన్నారు. ప్రస్తుతం మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వల్ల ఎంతోమంది నిరుద్యోగులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి పి.శ్రావణి మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాల పాలసీని పరిశీలించి దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కుటుంబంలో 18 సంవత్సరాల నిండిన బాలికలకు నెలకు 15 వందల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి ఇంతవరకు ఎటువంటి హామీలను నెరవేర్చలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. ప్రధానంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై, బాలికలపై లైంగిక దాడులు ఎక్కువయ్యాయని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి శ్రావణి రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షమీమ్ బేగం, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి దేవి, కార్యదర్శి రజిత, ఆఫీస్ బేరర్స్ మర్తుజాబి, స్వాతి, సుశీలమ్మ, లక్ష్మీదేవి, ప్రమీల, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ నష్టపరిహార పెంపును పరిశీలిస్తాం : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల: జాతీయ రహదారి 340సి ప్యాకేజీ కింద పెండింగ్ లో ఉన్న నష్టపరిహార పెంపును పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ క్లెయిమ్స్‌ల నష్టపరిహార పెంపు విషయంపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 340సి ప్యాకేజీ కింద జూపాడు బంగ్లా మండలం మండ్లేమ్ గ్రామానికి సంబంధించి 20.26 ఎకరాలలో 49 భూ సేకరణ బాధితులకు సంబంధించిన క్లెయిమ్స్‌లకు సంబంధించిన నష్టపరిహార పెంపు అంశంపై పరిశీలిస్తామన్నారు. జాతీయ రహదారులు, భూ సేకరణ అధికారులు, సంబంధిత రైతులు వివరించిన అంశాలను పరిగణలోకి తీసుకొని నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కోల్పోయిన స్ట్రక్చర్లు, దెబ్బతిన్న పంటలు, కమర్షియల్ పంటలు తదితరాలన్నీ సంబంధిత తాసిల్దార్ నుండి నివేదికలు తెప్పించుకుని పరిశీలిస్తామన్నారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించి జాతీయ రహదారుల నిర్మాణా నికి అవసరమైన భూములకు రిజిస్ట్రేషన్, మార్కెట్ ధరలను తీసుకొని ధరలను నిర్ధారి స్తామన్నారు. ఈ క్రమంలోనే భాగంగా 49 భూ సేకరణ బాధితులకు సంబంధించిన క్లెయిమ్స్‌ల నష్టపరిహార పెంపు నిశితంగా పరిశీలిస్తామన్నారు. ఎన్హెచ్ తహశీల్దారులు ఆల్ఫ్రెడ్, సువర్ణ, ఎన్ హెచ్ అధికారులు, బాధిత రైతులు పాల్గొన్నారు.

గుండె పోటుతో వీఆర్ఏ మృతి

విశాలాంధ్ర – చాగలమర్రి : మండలం లోని శెట్టివీడు గ్రామ విఆర్ఏ బాదుర్‌బాష (55) గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆర్ఐ అబ్దుల్ సత్తార్, వీఆర్ఓ వెంకట్రామిరెడ్డి, వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు అబ్దుల్లాలు గురువారం గ్రామానికి చెరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుని కుటుంబీలకు సంతాపం తెలిపి, మృతుని భార్య మహబూబ్‌బీకి అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వ ఆర్థిక సహాయం రూ 25 వేలు అందజేశారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, వీఆర్ఓలు ప్రసాద్, శిఖామణి, నరసింహ, ఆనంద్, బాష, మాబ్బి, షరీఫ్‌లు ఉన్నారు.

రైస్ మిల్లును పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర – బనగానపల్లె: ప్రమాదం జరిగిన శ్రీనివాస్ రైస్ మిల్లును జిల్లా అధికారులు గురువారం నాడు పరిశీలించారు. జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి మీడియాతో మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన రైస్ మిల్లులో వడ్లు నింపుతుండగా బంకర్ కూలడంతో ఒకరి చనిపోగా ఇద్దరికీ తీవ్ర గాయాలైన తెలిపారు. రైస్ మిల్ యజమాని ప్రమీల దేవి రైస్ మిల్లుకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యజమానికి నోటీస్ ఇచ్చి చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ శోభా రాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను అక్షరాస్యులుగా చేయడమే ధ్యేయం

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : ప్రతి గ్రామంలో చదువురాని మహిళలను అక్షరాస్యులుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో మహబూబ్ ఖాన్ అన్నారు. స్థానిక పొదుపు భవనం నందు గురువారం ఉల్లాస్ వయోజన విద్యా అక్షరాస్యత గురించి శిక్షణా కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ ఖాన్ మరియు పుణ్యవతి లు ఆర్థిక అక్షరాస్యత మరియు ఫైనాన్సియల్ అక్షరాస్యత గురించి వివరించారు. ప్రతి గ్రామంలో మహిళలను పూర్తిగా అక్షరాస్యులుగా చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వము ముందడుగు వేసిందన్నారు. గ్రామాల నుండి వచ్చిన వాలంటరీ టీచర్ లకు మహిళా అక్షరాస్యత, పలు అంశాల మీద శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంఈఓ శోభా వివేకావతి, అంగన్వాడి సూపర్వైజర్ పార్వతి, వెలుగు ఏపీఎం గోపాల్ తదితరులు మాట్లాడుతూ సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యసన అవగాహనపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి లు, అకౌంటెంట్, ఎంఎంఎస్ లీడర్లు పాల్గొన్నారు.

అధికలోడు వాహనాలకు జరిమానా

విశాలాంధ్ర – కొలిమిగుండ్ల: మండలంలోని ఆయా గ్రామాల ప్రధాన రహదారులలో వాహనాలను రవాణా శాఖ అధికారులు గురువారం తనిఖీ చేశారు. నంద్యాల రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవిశంకర్ నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేయగ అధికలోడుతో వెళ్తున్న ఐదు వాహనాలకు రూ రెండు లక్షల రూపాయలను జరిమానా విధించారు. కొలిమిగుండ్ల లోని జమ్మలమడుగు సర్కిల్, బెలుం గ్రామ సమీపంలోని ప్రధాని రహదారిపై తనిఖీ చేశారు. రహదారి నిబంధనలను పాటించకుండా అధిక లోడు, మితిమీరిన వేగంతో వెళితే చర్యలు తప్పవని రవాణా శాఖ అధికారులు హెచ్చరించారు.

మార్చి చివరినాటికి పూర్తి చేయాలి

విశాలాంధ్ర – రుద్రవరం: ఈ ఏడాది మార్చి చివరినాటికి పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి, హౌసింగ్ ఏఈ నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బంది, ఇంజనీర్ అసిస్టెంట్లు లతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 90 రోజుల ప్రణాళికలో భాగంగా మంజూరైన 62 పక్కా గృహ నిర్మాణాలు మార్చి చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. అన్ని పథకాల కింద మంజూరై నిర్మాణం పూర్తి చేసుకున్న పక్కా గృహాలలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు కూడా పూర్తి చేయించాలన్నారు. గ్రామీణ పథకం కింద మంజూరైన గృహాలు కూడా నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధి ఏపీఓ ప్రతాప్, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్లు ఆనందు, ప్రసాద్ ఆయా గ్రామాల ఇంజనీర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎరువులు ఎమ్మార్పీ ధరకు విక్రయించాలి

విశాలాంధ్ర – ఆత్మకూరు టౌన్: ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. పట్టణంలో గురువారం శివ ట్రేడర్స్, కార్తీక్ అగ్రో ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి అత్మకూరు వారు తనిఖీ నిర్వహించడం జరిగింది. తనిఖీ లో భాగంగా సరైన పత్రాలు చూపనందున రూ.3,81,000 విలువ చేసే బయో ఉత్పత్తులు విక్రయ నిలుపుదల చేయడం జరిగిందన్నారు.

నంద్యాల అభివృద్ధే ధ్యేయం

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : నంద్యాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల టౌన్ లో 17వ వార్డు విశ్వనగర్, ఎన్జీవోస్ కాలనీ, 19వ వార్డు పొన్నపురం కాలనీ, నూనెపల్లి, క్రాంతి నగర్, రైతు నగర్, జ్ఞానాపురం, పెద్ద బండ, ఉప్పరపేటలో నూతన సీసీ రోడ్లకు, డ్రైనేజీ కాలువలకు, మున్సిపాలిటీ వాటర్ పైప్ లైన్లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టిందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రోడ్లు, కాలువలు, మంచినీటి వసతి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఆ సమస్యలను గమనించిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని, హామీ ప్రకారం ఆంధ్రప్రదేశ్ ని నవ్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దే దిశలో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రోడ్లను, కాల్వలను, పైప్ లైన్ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, మున్సిపల్ చైర్పర్సన్ మాబునిసా, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, టిడిపి వార్డు ఇంచార్జ్‌లు, టిడిపి వార్డు అధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ నాయబ్ అబ్దుల్ సత్తార్‌కు న్యాయం చేయాలి

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : నంద్యాల సబ్ రిజిస్ట్రార్ నాయబ్ అబ్దుల్ సత్తార్‌కు న్యాయం చేయాలని ఆల్మేవా నాయకులు డిమాండ్ చేశారు. నంద్యాల సలీంనగర్లో ఆల్మేవా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్ పాషా, గౌరవాధ్యక్షులు ఎస్ఎమ్డి అబులైస్‌ల అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ దౌలా అనబడే వ్యక్తి తమకు కోర్టు రెండుసార్లు ఇచ్చిన 20 రోజుల తాత్కాలిక స్టేను చూపుతూ రాష్ట్ర రిజిస్ట్రార్ కార్యాలయపు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి, నంద్యాల సబ్ రిజిస్ట్రార్ నాయబ్ అబ్దుల్ సత్తార్ సస్పెండ్ అవ్వడానికి కారణమయ్యాడని, 2015లోనే ఈ కేసును గెలిచిన అతని తమ్ముళ్లు సామాజిక మాధ్యమాల ద్వారా నిజా నిజాలను వెల్లడించారన్నారు. ఉన్నతాధికారులు ఈ సంఘటన పూర్వపరాలను సరైన విచారణ జరిపి నంద్యాల సబ్ రిజిస్ట్రార్ నాయబ్ అబ్దుల్ సత్తార్ ను నంద్యాల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కు రిఇన్స్టేట్ చేయాలని, ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఏపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్లు సయ్యద్ నబి రసూల్, మొహమ్మద్ రఫీ,మోమిన్ సైఫుల్ల, సయ్యద్ అమీరుద్దీన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ముహమ్మద్ ఫరూక్, డిస్ట్రిక్ట్ బాడీ మెంబెర్స్ సయ్యద్ అబ్దుల్ మునీర్, ముహమ్మద్ ఖాసిం, ముహమ్మద్ గౌస్, కలీముల్ల, సిర్వెళ్ళ మండల ట్రెజరర్ డిఎస్ నూరుల్ల తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర –అవుకు: ప్రణాళికాబద్ధంగా చదివి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి అని జిల్లా విద్యాధికారి జనార్దన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుండ్ల సింగవరం ఉన్నత పాఠశాల, అవుకు పట్టణంలోని బాలుర మరియు బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ ఉన్నత పాఠశాలలను మండల విద్యాధికారులు శ్రీధర్ రావు,వెంకటేశ్వర్ రెడ్డిలతో కలిసి జిల్లా విద్యాధికారి జనార్దన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను, వంటశాలలను పరిశీలించారు. పాఠశాలలోని పచ్చదనం పరిశుభ్రతను చూసి అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి అని వంట నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలో ప్రతి మూడవ మంగళవారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టి పాఠశాల క్రీడా మైదానాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.అనంతరం పాఠశాలలోనే రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా చదివి ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సింగయ్య, చెన్నకేశ్వరి, క్యాంప్ క్లర్క్ రామకృష్ణ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలి

విశాలాంధ్ర – నందికొట్కూరు : పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్‌ను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ తాలూకా సమితి ఆధ్వర్యంలో గురువారం నందికొట్కూరు పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి పటేల్ సెంటర్ నందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు వినోద్, దినేష్‌ల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మహానంది మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మేము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పెండింగ్‌లో ఉన్న రీయంబర్స్మెంట్‌ను విడుదల చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో హామీ ఇవ్వడం జరిగిందని,అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 మాసాలు అవుతున్నప్పటికీ ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చెయ్యక పోవటం సిగ్గుచేటుగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో కేవలం రూ.799 కోట్లకు మాత్రమే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సరికాదని అంతేకాకుండా ఈనెల తొమ్మిదో తారీఖున కళాశాలల అకౌంట్ లలో డబ్బులు వేస్తామన్న మాట ఏమైందని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు ఉస్మాన్, బన్నీ, మహిమ రాజు, కురియన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న సిమెంట్ రోడ్డు పరిశీలన

విశాలాంధ్ర – బనగానపల్లె: పట్టణంలోని ఆస్థానం వద్ద సిమెంట్ రోడ్డు నిర్మిస్తుండగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ లావణ్య నూతన సిమెంట్ రోడ్డు ను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లకు పలు సూచనలు ఇవ్వడం జరిగింది. నాణ్యతలో రాజీ లేకుండా నూతన రోడ్డు నిర్మిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు హాజీ, అన్ను తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడుతో ఘాట్ రోడ్‌లో వెళ్ళరాదు

విశాలాంధ్ర – ఆత్మకూరు టౌన్: ఆత్మకూరు నుంచి శ్రీశైలం వెళ్లే అధికలోడు, అధిక ఎత్తు ఉన్న వాహనాలు ఈ రహదారిలో వెళ్లరాదని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఏఎస్ఎన్ రెడ్డి శకావత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో భక్తాదులు అధిక సంఖ్యలో శ్రీశైలం వెళ్తుంటారని ట్రాఫిక్ నియంత్రణకు వాహనదారులు సహకరించాలని తెలిపారు. కర్నూలు, గిద్దలూరు రూట్‌లో వెళ్లాలని భారీ వాహనదారులకు తెలిపారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తానని సూచించారు.

వందశాతం అక్షరాస్యుల్ని చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర – చాగలమర్రి: గ్రామాల్లో పొదుపు సంఘాల్లో ఉండే మహిళల్లో కొందరు నిరక్షరాస్యులు ఉన్నారని, వందశాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్వైజర్ ఫయాస్, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాదు తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని పొదుపు కార్యాలయంలో గ్రామైక్య సంఘాలు, వాలంటీర్లు, మహిళలకు అక్షరాస్యతపై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వయోజన విద్య అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ప్రతి వాలంటీరు పదిమంది మహిళల చొప్పున విద్యనేర్పించాలన్నారు. ప్రతి రోజూ సాయంత్ర సమయాల్లో 2గంటల పాటు శిక్షణ ఇచ్చి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో నాగమ్మ, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశించిన సర్వేలు వేగవంతం చేయండి

విశాలాంధ్ర – శిరివెళ్ల : గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయ మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, తదితరులు ప్రభుత్వము నుండి వచ్చిన ఆదేశాలు నిర్దేశించిన సర్వేలను వేగవంతం చేయాలని డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ టి.శివారెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. డిఎల్‌డిఓ శివారెడ్డి మాట్లాడుతూ హౌస్ హెరాల్డ్ మ్యాపింగ్, మిస్సింగ్ డాటా, ఎన్ఆర్ఐ, వర్క్ ఫ్రం హెూం, జియో ట్యాగ్, తదితర సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రోజువారి ప్రోగ్రెస్ ప్రకారం వేగవంతంగా సర్వేలు నిర్వహించి ప్రోగ్రెస్ రిపోర్టు అందివ్వాలని అధికారులు ఆదేశించిన సర్వే పనులు నిర్దేశించిన సమయానికి ముందే పూర్తి చేయాలని ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలను పాటించాలి

విశాలాంధ్ర – చాగలమర్రి : ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలను అరికట్టేందుకు కృషి చేయాలని హెడ్ కానిస్టేబుల్ శంకర్ కోరారు.గురువారం చాగలమర్రి పట్టణంలోని శ్రీ వాసవి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ షాబుద్దీన్ అధ్యక్షతన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌సి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.అలాగే మద్యం సేవించి,మొబైల్ మాట్లాడుతూ వాహనాలను నడిపితే ప్రమాదాల బారిన పడి కుటుంబాలు అనాథలయ్యే పరిస్థితి ఏర్పడుతుందని తెలియజేసారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పుల్లారెడ్డి,రామశేషయ్య,ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మహేశ్వరయ్య, పోలీస్ సిబ్బంది, జిఎంఎస్‌కేలు ప్రసన్న, ధరణి, పర్వీన్ పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర–బేతంచెర్ల : స్వాతంత్ర్య సమరయోధుడు బెంగాల్ టైగర్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యన్న ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం మాట్లాడుతూ నేతాజీగా పేరుగాంచిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ అని, ఆయన జనవరి 23, 1987లో ఒరిస్సాలోని కటక్‌లో జన్మించారని,రెండు పర్యాయాలు నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్నప్పటికీ గాంధీజీతో తలెత్తిన సిద్ధాంతపరమైన విభేదాల కారణంగా రాజీనామా చేయాల్సి వచ్చిందని,అహింసా వాదంతో స్వాతంత్ర్యం సాధించలేమని నినదించి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ను స్థాపించారు. ఆయన మీద గారిబాల్డి మజీలీల ప్రభావం ఉండడంతో ఆయన 1939లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు ఆంగ్లేయుల పై పోరాడేందుకు రష్యా జర్మనీ జపాన్ దేశాలలో పర్యటించాడు భారత యుద్ధ ఖైదీలు, రబ్బరు తోట కూలీలు అవస్థాహితుకులతో భారత జాతీయ సైన్యం ఏర్పాటు చేశాడు జపాన్ ప్రభుత్వం అందించిన సైనిక ఆర్థిక దౌత్య సహకారాలతో ఆజాద్ హింద్ ఫౌజ్ ఏర్పాటు చేశారని వారి సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల నాయకులు శ్రీకర్, కిషోర్, సురేష్, హుస్సేన్, పవన్, మధు, హనుమ తేజ వెంకీ, ప్రశాంత్, సురేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి



విశాలాంధ్ర– కోవెలకుంట్ల: నేటి యువత నేతాజీని ఆదర్శంగా తీసుకుని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ దేశ, రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతూ, తమ వంతు అండగా నిలబడాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టు బడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. పిలుపునిచ్చారు. గురువారం కోవెలకుంట్లలో బస్టాండ్ సమీపంలో మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో 128 వ జయంతిని పురస్కరించుకుని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతాజీకి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తనకు దక్కిన గొప్ప వరమని మంత్రి అన్నారు. నాడు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి ఇండియన్ ఆర్మీని రూపొందించిన మహనీయుడు నేతాజీ అన్నారు. నేడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశానికి అందించిన ప్రేరణతోనే, దేశ రక్షణ కోసం మెజార్టీ యువత ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం యువత నేతాజీని ఆదర్శంగా తీసుకుని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ దేశ, రాష్ట్రాభివృద్ధికి పాటువడుతూ తమవంతు అండగా నిలబడాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఏకైక లక్ష్యంతో పరిశ్రమలు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పట్టణాలతో సమానంగా గ్రామాల్లో కూడా మౌలిక సదుపాయాల కల్పనతో సమగ్రాభివృద్ధి జరిగితేనే ఈ రాష్ట్రం అభివృద్ధిపథంలో ముందుకు సాగుతుందన్నారు. నేడు సంక్షేమాన్ని, అభివృద్ధి రెండింటిని సమన్వయంతో ముందుకు తీసుకువెళుతున్నామని అన్నారు. రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి జరగాలంటే బలమైన ప్రభుత్వం ఉండాలనే ఆలోచనతోనే అన్ని వర్గాల ప్రజలు ఏకమై నేడు కూటమి ప్రభుత్వానికి 164 సీట్లతో అఖండ విజయాన్ని అందించారన్నారు.

విశాలాంధ్ర– కోవెలకుంట్ల: భారతరత్న, బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో దళిత, బడుగు, బలహీన వర్గాలకు అత్యున్నత రాజ్యాంగబద్ధ పదవుల్లో స్థానం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతోందని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు ప్రధాన రహదారిలోని జమ్మలమడుగు సర్కిల్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతరత్న, బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అదృష్టం చాలా అరుదుగా, అతి తక్కువ మందికి మాత్రమే లభిస్తోందని, ఇది నిజంగా తన పూర్వ జన్మసుకృతమన్నారు. దేశంలో కులాలు, మతాలు లేవని, మనందరం భారతీయులమని చాటి చెప్పిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. నాడు అంబేద్కర్ అందించిన స్ఫూర్తి తోనే ఎంతో మంది దళిత, బడుగు బలహీన వర్గాలు రాజకీయాల్లో ఉన్నత స్థానాలు అధిరోహించారన్నారు. తహశీల్దార్ పవన్ కుమార్ రెడ్డి, ఎంపీడీవో వరప్రసాద్ రావు, ఈఓఆర్‌డి ప్రకాష్ నాయుడు, ప్రజా సంఘ నాయకులు సుధాకర్, వడ్డే సుబ్బరాయుడు, అప్పల పోగు వెంకట సుబ్బయ్య, జనసేన నాయకుడు దొడియం గురప్ప, టిడిపి నాయకుడు బివి ప్రసాద్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, టిడిపి కార్యదర్శి గడ్డం రామ కృష్ణారెడ్డి, టిడిపి యూత్ లీడర్ పేరా శ్రీధర్ రెడ్డి, టిడిపి యువ నాయకుడు గడ్డం అమర్నాథ్ రెడ్డి, పొట్టిపాడు సుబ్బారెడ్డి, వెలగటూరు ధనుంజయుడు, ఎస్.ఎన్ గఫూర్, పెనుగొండ శేఖర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, శుక్రవారం 24, జనవరి 2025

వృత్తి ద్రోహానికి పాల్పడిన ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు : డీఎస్పీ

విశాలాంధ్ర – కోడుమూరు : విద్యార్థినీలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువు స్థానంలో ఉంటూ వృత్తి ద్రోహానికి పాల్పడిన ఉపాధ్యాయుడు లక్ష్మన్నపై శాఖా పరమైన కఠిన చర్యలు ఉంటాయని డిఎస్పీ బాబుప్రసాద్ అన్నారు. గురువులు, వైద్యులు, పోలీసులు ఈ మూడు వ్యవస్థలలోని వారి పట్ల సమాజంలోని ప్రతిఒక్కరికీ గౌరవం ఉంటుందన్నారు. గురువు వ్యవస్థ ఎంతో గొప్పదని, వ్యవస్థకు వ్యతిరేకంగా నడుచుకున్న ఇలాంటి వారి వల్ల వ్యవస్థకే ముప్పు వాటిల్లుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మండలంలోని వెంకటగిరి గ్రామంలోని స్పెషల్ స్కూల్లో విద్యార్థినిల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన టీచర్ లక్ష్మన్నపై నమోదైన ఫోక్సో చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తులో భాగంగా డీఎస్పీ బాబు ప్రసాద్ గురువారం ఉదయం వెంకటగిరి చేరుకొన్నారు. కేసు విచారణ అనంతరం పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో కర్నూలు డిఎస్పీ బాబుప్రసాద్ కోడుమూరు సిఐ ఎండి తబ్రేజ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ వ్యవస్థలన్నింటిలోకి విద్యావ్యవస్థ గొప్పదని, విద్యా వ్యవస్థకే మచ్చు తెచ్చిన .పిల్లల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాల్సిన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, పిల్లల పట్ల అసభ్యకరంగా నడుచుకోవడం దారుణమన్నారు. ఇలాంటి ఒకరిద్దరి టీచర్ల వల్ల వ్యవస్థకే భంగం వాటిల్లుతుందన్నారు. టీచర్ లక్ష్మన్నపై అన్నివిధాల బలమైన సాక్షాలను సేకరించి,అన్ని ఆధారాలతో కేసు పూర్తి నివేదికలను కోర్టు ముందుకు తీసుకెళ్తామన్నారు.అయితే ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థినీ-విద్యార్థులకు, అమ్మాయిలకు సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాక్ టచ్ వంటి వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిఎస్పి తెలియజేశారు.

ఆటో కార్మికులకు సంక్షేమ చట్టం అమలు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: ఆటో కార్మికులకు సంక్షేమ చట్టం అమలు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించి, వాటిని జీఎస్టీ పరిధిలోకి తీసుకు రావాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అంబేద్కర్ భవన్‌లో కర్నూలునగర ఆటో వర్కర్స్ యూనియన్ 9వ మహాసభలు ఏఐటీయూసీ నగర డిప్యూటీ కార్యదర్శి రామాంజి అధ్యక్షతన నిర్వహించారు. అంతకు ముందు కలెక్టరేట్ నుండి అంబేద్కర్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ భవన్ వద్ద ఏర్పాటుచేసిన ఏఐటీయూసీ పతాకాన్ని ఆటో వర్కర్స్‌యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు క్రిష్ణయ్య ఆవిష్కరించారు. అనంతరం నగరంలో ఆటో వర్కర్స్‌ను యూనియన్ మొదటస్థాపించిన మైకెల్ బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మునెప్ప మాట్లాడుతూ ఆటోకార్మికులకు ప్రభుత్వం సంక్షేమ చట్టం అమలుచేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగం ఎక్కువ ఉండటం వలన నిరుద్యోగులందరూ ఉపాధికోసం ఆటో రంగంను ఎన్నుకుంటున్నారన్నారు. దీంతో ఆటో రంగంలో పోటీ అధికమై రోజంతాకష్ట పడినా కుటుంబం గడిచే అవకాశం లేకుండా పోయిందన్నారు. దీనికి తోడు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి పోయాయన్నారు. ప్రభుత్వం పెట్రోల్, డీజిల్,గ్యాస్‌లను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జీఓ నెం 21,31లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కర్నూలునగరంలో సుమారు 15 వేల మంది ఆటో కార్మికులు ఉన్నార న్నారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం కాలనీలు ఏర్పాటు చేసి స్థలం కేటాయించి ఇంటినిర్మాణం చేపట్టాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం వలన ఆటో కార్మికులకు కుటుంబాలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనేసంక్షేమ చట్టం అమలు చేయాలన్నారు. అంతకు ముందు ట్రాఫిక్ సీఐ అసరుద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి క్రమ శిక్షణ అవసరమన్నారు. కార్మికులు తమతోపాటు తమ తోటి కార్మికుడు సంతోషంగా ఉండాలను కుంటే అందరూ ఆనందంగా ఉంటారన్నారు. ఆటో కార్మికులు అందరూ తప్పని సరిగా ఆటోను ఇన్సురెన్స్ చేయించుకోవాలన్నారు. రెండు రోజులు పస్తులున్నా పరవలేదని ఇన్స్‌రెన్సు చేయడం మరవవద్దన్నారు. దీని వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రమాదాలు మనకు తెలిసి రావలని ఇన్సురెన్సు చేయడం వలన మన కుటుంబంకు న్యాయం జరుగు తుందన్నారు. ఆటో కార్మికులు ట్రాఫిక్ రూరల్స్ తప్పక పాటించాలన్నారు. యూనియన్ నాయకులు రూరల్స్‌పై కార్మికుల కు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం సీపీఐ నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డి, ఏఐటీయూసీ నగర అద్యక్షులు వెంకటేష్ తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్,నగర అద్యక్ష కార్యదర్శులు రాము, క్రిష్ణారెడ్డి, అబ్బాసు, శ్రీనునాయక్, రఘు, కోండల్, జయరాం, నాగరాజు, రవి, ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ కార్యాలయం కడపలోనే కొనసాగించాలి

విశాలాంధ్ర– పత్తికొండ: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యా లయాన్ని కడపలోనే కొన సాగించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్డీవో భరత్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో నాలుగు గ్రామీణ బ్యాంకులు కలిసి ఒకే గ్రామీణ బ్యాంకు గా ఏర్పడుతున్నందున కడపలో ఉన్న ప్రధాన కార్యాలయాన్ని రాజధాని అమరావతి కేంద్రానికి తరలించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకో వాలని డిమాండ్ చేశారు. దక్షిణ భారతదేశంలో ఏ గ్రామీణ బ్యాంకు కు లేని కరెన్సీ చెస్ట్ సౌకర్యం కడప ఏపీజీబీ ప్రధాన కార్యాలయానికి ఉందని, కరువు ప్రాంతమైన రాయలసీమ జిల్లాల్లో వెనుకబడిన వర్గాలకు రుణ సౌకర్యం కల్పిస్తున్న కార్యాలయాన్ని కడపలోనే కొనసా గించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షవర్ధన్, రవి పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర–పెద్దకడబూరు: మండలంలోని చిన్నతుంబలం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారిణి జ్యోత్స్న మాట్లాడుతూ పశువులకు సోకే అన్ని రకాల జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పాడి రైతులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరేష్ గౌడ్, చంద్రశేఖర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

విశాలాంధ్ర – పెద్దకడబూరు: రైతులకు నకిలీ డీ పట్టాలు, నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు, నకిలీ చెక్కులు ఇచ్చి మోసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని హులికన్వి గ్రామంలో తలారి తిక్కయ్య, తలారి కుమారుడు రేణుకారెడ్డి, నాగరాజు లు కలిసి హులికన్వి గ్రామం మరియు చుట్టూ ప్రక్కల గ్రామాలలో ఉన్న రైతులు హెబ్బటం నల్లారెడ్డి, బోపల్లి హుసేని, మేకడోన ఉరుకుంద, పెద్దతుంబళం విశ్వనాథ్, తిమ్మప్ప, చింతల గానీ పద్మ, చింతల గాని మారయ్యలకు పంట నష్ట డబ్బులు, పంటల భీమా, కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి డబ్బులు ఇప్పిస్తామని, పంట పొలాలకు డీ పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పిస్తామని చెప్పి రైతుల నుంచి 4.56 లక్షలు డబ్బులు తీసుకొన్నారని తెలిపారు. వారికి నకిలీ డీ-పట్టాలు, నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి మోసం చేశారని హులికన్వి గ్రామానికి చెందిన హెబ్బటం నల్లారెడ్డి ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

లారీ ఢీకొని, యువకుడి మృతి

విశాలాంధ్ర – ఆస్పరి: మండల పరిధిలోనే చిగిళి గ్రామ బస్టాండ్ సమీపంలోని మిట్ట దగ్గర లారీ స్కూటర్ ఢీకొన్న ఘటనలో బిణిగేరి గ్రామానికి చెందిన కల్లుబావి వీరేంద్ర(20) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల మేరకు... బిణిగేరి గ్రామానికి చెందిన గోవిందమ్మ, చిన్న నాగేష్ దంపతుల కుమారుడు వీరేంద్ర ఆస్పరిలోని ఓ వత్తి దుకాణంలో పనిచేస్తున్నాడు. సాయంత్రం పని ముగించుకుని బిణిగేరి గ్రామానికి మోటార్ వెహికల్ పై బయలుదేరాడు. అయితే చిగిళి గ్రామ బస్టాండ్ సమీపంలోనే మిట్ట దగ్గర ఆదోని నుండి ఆస్పరి మీదుగా వెళు తున్న లారీ ఎదురుగా వస్తున్న బైక్ ను ఢీకొంది. దాంతో వీరేంద్ర తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు. గ్రామ సమీపంలోనే కన్న కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్న తీరు వర్ణనాతీతం. బోయ వీరేంద్ర మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

మైనర్ బాలికలను లైంగికంగా వేధించిన ఉపాధ్యాయున్ని శిక్షించాలి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: కోడుమూరు మండలం వెంకటగిరిలో బాలికను లైంగికంగా వేధింపులకు గురిచేసిన ఉపాధ్యాయుడును కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి వి.భారతి డిమాండ్ చేశారు. గురువారం సీఆర్ భవన్ నందు జరిగిన పాత్రికేయుల సమావేశంలో వి.భారతి మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న లక్ష్మన్న అనే ఉపాధ్యాయుడు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ సమాజం తలదించుకునే విధంగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. తన వికృత చేష్టలతో మైనర్ బాలికలను లైంగికంగా వేధిస్తూ రాక్షస ఆనందం పొందుతున్న ఇలాంటి కీచక ఉపాధ్యాయులను కఠినంగా శిక్షించాలని, ఫోస్కోచట్టం కింద కేసు నమోదు చేయాలన్నారు. బెయిల్ రాకుండా జైల్లో ఉంచడమే కాకుండా ఆ కీచక ఉపాధ్యాయున్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి నిందితునికి కఠినంగా శిక్షించాలన్నారు. కీచక ఉపాధ్యాయుడు ద్వారా వేధింపులకు గురైన మైనర్ బాలికకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించి ఉన్నత చదువులకు సహకరించడంతోపాటు వారి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య నగర ఆఫీస్ బేరర్స్ పావని, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష

విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు: గోనెగండ్ల మండలం, గంజహల్లి గ్రామంకు చెందిన దర్గా షేక్షావలి కర్నూలు నగరంలోని మహావీర్ నగర్‌లో ఓ మైనర్ బాలిక పట్ల అఘాయిత్యంకు పాల్పడ్డాడు. దీనిపై కర్నూలు మహిళా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. దీనిపై గురువారం జిల్లా ఫోక్సోకోర్టు నిందితునికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.10 వేలు జరి మాన విధిస్తూ తీర్పు నిచ్చింది. వివరాల్లోకి వెళితే మహావీర్ నగర్‌కు చెందిన మైనర్ బాలిక తల్లి జి.శాంత ఫిర్యాదు మేరకు 2021 ఆగష్టు 12వ తేదీన కర్నూలు మహిళా పోలీసు స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 74 / 2021 ఫోక్సో యాక్ట్ 2012 నమోదు చేశారు. అప్పటి మహిళా పీఎస్ డిఎస్పీ వెంకట రామయ్య దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించిన కర్నూలు జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి భూపాల్ రెడ్డి నిందితుడుకి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరి మానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితు రాలికి ప్రభుత్వం తరపున రూ.2 లక్షల నష్ట పరిహారం వచ్చే విధంగా జడ్జి భూపాల్ రెడ్డి తీర్పు వెలువరించారు. ముద్దాయికి శిక్ష పడటంలో కృషి చేసిన స్పెషల్ పి.పిలు వెంకటేశ్వరెడ్డి, ప్రకాష్ రెడ్డి, దర్యాప్తు అధికారి మహిళా పియస్ డిఎస్పీ వెంకటరామయ్య, మహిళా పీఎస్ కోర్టు కానిస్టేబుల్స్ మధుశంకర్, గోపిలను జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ అభినందించారు. అఘాయిత్యాలకు పాల్పడే వారికి కోర్టు తీర్పు ఒక గుణపాఠం కావాలని జిల్లా ఎస్పీ అన్నారు.

కిషోరి వికాసంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర – నందవరం : బాలికల బాల్య వివాహల అరికట్టి, బాలికల విద్య అభివృద్ధి కృషి చేయాలని, ఐసీడియస్ సిడిపిఓ సఫరున్నీసా బేగం, ఎంపిడిఓ పుల్లయ్య, ఎంఈవో-2 రఘునాథ్‌లు అన్నారు. గురువారం ఎంపిడిఓ కార్యాలయం సిడిపీఓ ఆధ్వర్యంలో కిషోరి వికాసంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిషోరి వికాసంలో 11 నుండి 19 ఏళ్ల బాల, బాలికల పై ఎక్కువ శ్రద్ధ అవసరమని, ముక్యంగా తల్లిదండ్రులు బాలికల విద్య విషయంలో ముందుండాలని, వారిని అక్షరాస్యులుగా చేస్తేనే సమాజం ముందడుగు వేస్తుందన్నారు. బాల్య వివాహాలతో బాలికలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారని, వాటి నిర్మూలనకు సచివాలయంలోని ప్రతి అధికారి ప్రత్యేక దృష్టి పెట్టి బాల్య వివాహాల చట్టలతో వాటిని అరికట్టాలన్నారు. అందుకు మండల స్థాయి అధికారులు ఎప్పుడు సహాయ సహకారాలు అందిస్తారన్నారు. అలాగే బాల్యవివాహం జరిగితే బాలికకు జరిగే నష్టాలను తల్లిదండ్రులకు, బాలికలకు అవగాహనా కల్పించాలని, అందుకు అందరూ భాగస్వాములు కాగలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి సందీప్, ఎపియం రాఘవేంద్ర, ఎపిఓ శ్రీనివాసులు, హెల్త్ సూపర్ వైజర్ బలరాం, మండలం సూపర్ వైజర్లు సుచరిత, సుధావతి,నీలమ్మ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం విద్యార్థులు ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర –ఆలూరు : మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నందు గురువారం పదవ తరగతి విద్యార్థులు సులభంగా ఉత్తీర్ణులు కావడానికి ఎస్‌టియు ఆధ్వర్యం లో ఏపీ అకాడమిక్ కమిటీ తయారు చేసిన ఎస్ఎస్‌సి స్టడీ మెటీరియల్‌ను మండల విద్యా శాఖ అధికారి కోమలాదేవి, చిరంజీవి రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టియు రాష్ట్ర నాయకుడు నాగరాజు మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థులకు ఎస్టీయూ ఏపీ అకాడమిక్ కమిటీ వారు తయారుచేసిన స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా ఉందని, ఇందులో అన్ని సబ్జెక్టులకు సంబంధించి అకాడమిక్ స్టాండర్డ్ ప్రకారం తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు పొందేలా ముఖ్యమైన ప్రశ్నలు సమాధానాలతో రూపొందించడం జరిగిందని. ఏబిసిడి గ్రేడ్ విద్యార్థులకు అందరికీ ఎంతో ఉపయోగకరంగా కలదన్నారు. వచ్చే ఎస్ఎస్సి ఫలితాల్లో వందశాతం ఫలితాలు సాధించడానికి అందరూ కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు మండల అధ్యక్షుడు అశ్విని కుమార్, ప్రధాన కార్యదర్శి రమేష్, మండల ఆర్థిక కార్యదర్శి సూర్యనారాయణ, సీనియర్ నాయకులు , గిరయ్య, సురేష్, సోమన్న, నాగరాజు, రామకృష్ణ, విజయ రాధ, సాయి కుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు గోవిందప్ప, రంగస్వామి పాల్గొన్నారు.

ఉపాధి ఏపీవో రామకృష్ణను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర – ఆస్పరి : ఉపాధి హామీ పథకంలో ఏపీవోగా విధులు నిర్వహిస్తు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో రామకృష్ణను తక్షణమే సస్పెండ్ చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బ్రహ్మయ్యలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో ఏపీఓగా గతంలో కొంతకాలంగా రామకృష్ణ పని చేశారని, మళ్లీ రెండవసారి ఏపీవోగా ఆస్పరికి వచ్చి గ్రామాల్లో అవినీతికి తెర లేపి విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడుతున్నాడని వారు ఆరోపించారు. ప్రభుత్వం ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన గోపాలమిత్ర యూనిట్స్ మంజూరులో అవినీతికి పాల్పడ్డాడన్నారు. అవినీతి ఏపిఓ నిర్వాకం కారణంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం పక్కదారి పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఉపాధి హామీ పథకం యొక్క లక్ష్యం నీరుగారి పోతుందని, మండలంలో జరుగుతున్న పనులను ఉపాధి పథకం జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఇప్పటికే అనేకమంది ఉపాధి లేక పనులు లేక గ్రామాల నుండి వలసలు పోతున్నారని, వలసలను నివారించాల్సిన అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఏపీఓని తక్షణమే సస్పెండ్ చేసి గ్రామాల్లో వలసలు నివారించి ఉపాధి పనులు ప్రారంభించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉరుకుందప్ప, రామాంజనేయ, రవి, సంజప్ప తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు సాధన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: కర్నూల్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అత్యవసర ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో హైకోర్టు సాధన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.కమిటీ చైర్మన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బిఎస్. రవికాంత్ ప్రసాద్, వైస్ చైర్మన్ కన్వీనర్‌గా కె.కపిలేశ్వరయ్య, కో కన్వీనర్‌గా దాసెట్టి శ్రీనివాసులు వ్యవహరిస్తారు.బార్ కౌన్సిల్ మెంబర్ పి.రవి గువేరా, మాజీ సీనియర్ న్యాయవాదులు శివరామయ్య, ఏ.రామ సుబ్బారెడ్డి, సి.నాగేంద్ర నాథ్, ఎం ఎల్.శ్రీనివాసరెడ్డి, ఎస్.చాంద్ బాష, జి.విజయ కుమార్, బి.మురళి మనోహర్, ఎండివి జోగయ్య శర్మ, కె.రంగనాథ్, వి.నాగలక్ష్మి దేవి, పి.నిర్మల, కె.మోహన్ బాబు, కేఈ జగదీశ్ కుమార్,సుమనరాణి, సివి శ్రీనివాసులు, ఎస్‌పి ఇందు మతి లను కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారు. ఈ కమిటీ, హై కోర్టు బెంచి కొరకు ఏర్పాటు చేసిన కమిటీని కలవడం,అన్ని జ్యుడీషియల్ ట్రిబ్యునల్స్ సాధనకు, న్యాయవాదుల సంక్షేమ విషయాల సాధనకు, కృషిచేస్తుందని జిల్లా బార్ అసోసియేషన్ తీర్మానం చేసింది.

పాఠశాలల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపండి

విశాలాంధ్ర–గూడూరు: మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను మండల విద్యాధికారిని సునీలమ్మ కోరారు. గురువారం మండలంలోని ఎమ్మార్సీ భవన్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ పాఠశాల అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అభివృద్ధికి సహకరించాలని అన్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్లో పాఠశాలలకు ప్రత్యేక నిధులు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గుర్తు చేశారు. కావున పాఠశాలల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపితే త్వరలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలవుతుంది అని గుర్తు చేశారు.

నేడు విద్యాశాఖ సమావేశం

విశాలాంధ్ర – కర్నూల్ ఎడ్యుకేషన్ : కర్నూలు ఉమ్మడ జిల్లాల్లోని పాఠశాలలను బలోపేతం చేయడం, జీవో నెంబర్ 117 ఉప సంహరణ తదితర అంశాలపై విద్యాశాఖ కమిషనర్ వి.విజయ రామరాజు కర్నూలు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియం నందు శుక్రవారం మధ్యాహ్నం 2.00 సమావేశం నిర్వహించడం జరుగుతుంది. ఈ సమావేశానికి సీఎస్ ఆదేశాల మేరకు జిల్లాల కలెక్టర్లు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అధికారులు, జెడ్పీ సీఈవోలు హాజరు కానున్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాల డివిజనల్ ఉప విద్యాధికారులు, నియోజకవర్గ అధికారులు, మండల విద్యాధికారులు, 294 మంది క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు హాజరు కానున్నారు. వందమంది మండల విద్యాశాఖ అధికారులు హాజరు కానున్నారు. హాజరయ్యే అధికారులందరికీ పుల్లారెడ్డి ఇంజనీరింగ్ ఆడిటోరియం నందు మధ్యాహ్నం వసతి ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

విశాలాంధ్ర – పెద్దకడబూరు: మండల పరిధిలోని హనుమాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై టీవీఎక్సెల్ ను కారు బలంగా ఢీ కొన్న ప్రమాదంలో కొత్త గొల్లలదొడ్డి చెందిన బోయ సోమశంకర్ (14)అనే బాలుడు మృతి చెందినట్లు గురువారం ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు మృతుడు హనుమాపురానికి చెందిన తన తాత రామన్నతో కలిసి పొలానికి వెళుతుండగా ఎమ్మిగనూరు నుంచి వస్తున్న కారు వేగంగా నిర్లక్ష్యంగా ఢీ కొట్టడంతో సోమశంకర్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు.

బాల, బాలికల ఉజ్వాల భవిష్యత్తు కిషోర్ వికాసం

విశాలాంధ్ర – క్రిష్ణగిరి: మహిళలు, బాలికల ఉజ్వల భవిష్యత్ కోసమే కిశోర్ వికాసను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఎంపీడీవో మోహన్ కుమార్, మెడికల్ అధికారి డాక్టర్ ప్రదీప్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన క్రిష్ణగిరి ఎంపీడీవో కార్యాలయంలో ఐసిడిఎస్ సిడిపిఓ లూకా అధ్యక్షతన కిషోర్ వికాస్ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులకు, అంగన్వాడి కార్యకర్తలకు, వైద్య సిబ్బందికి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 11 నుండి18 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్న బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వలంబనం మెరుగుపరచాలన్నారు. గ్రామాల్లో బాలికలకు సంఘాలను ఏర్పాటు చేసి బాలికలు శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు అవగాహన సదస్సులను చేపట్టాలన్నారు. రాష్ట్రంలో బాల్యవివాహాలు, బాల కార్మికులు, బాల నేరస్తుల నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కిషోర్ వికాసం అనే కార్యక్రమం చేపట్టడం జరిగిందని వారు తెలిపారు. కిషోర్ వికాస కార్యక్రమం ద్వారా బాలికల సర్వతోముఖ అభివృద్ధికి ప్రధానోపాధ్యా యులు, అంగన్వాడి కార్యకర్తలు ముఖ్యపాత్ర వహించాలని వారు తెలిపారు. అనంతరం పని ప్రదేశాల్లో మహిళలపై హింస వేధింపుల నివారణ చట్టం అమలు వాల్ పోస్టు విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుగుణమ్మ, పోషణ అభిమాన్ బ్లాక్ కోఆర్డినేటర్ సుజాత,ఐ సి పి ఎస్ నరసింహులు,ఎంఈఓ మద్దయ్య, వెలుగు ఏపీఎం మహేశ్వరయ్య, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

సీనియర్ పాత్రికేయులు హనుమంతు మృతి

విశాలాంధ్ర – కర్నూలు: విశాలాంధ్ర సీనియర్ పాత్రి కేయుడు హనుమంతు బుధ వారం అర్థరాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. హను మంతు విశాలాంధ్రలో గత 20 ఏళ్లుగా పాత్రికేయునిగా పని చేస్తున్నారు. దాదాపు 18 ఏళ్లపాటు వెల్దుర్తి రిపోర్టర్‌గా పనిచేస్తూ ఇటీవల కర్నూలు నగరంలో పాత్రికేయునిగా బాధ్యతలు చేపట్టారు. హనుమంతు మృతి విషయం తెలుసుకున్న పాత్రికేయ మిత్రులు నగరంలోని అశోక్ నగర్-2 లైన్‌లోని హనుమంతు గృహానికి వెళ్ళి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, కుటుం బానికి తమ సంతాపం, సానుభూతిని తెలియచేశారు. హనుమంతు మృతిని నివాళ్లర్పించిన వారిలో విశాలాంధ్ర బ్రాంచి మేనేజర్ కె.నాగరాజు, బ్యూరో ఇన్‌చార్జి శ్రీనివాసులుగౌడ్, అడ్వటైజ్‌మెంట్ ఇన్‌చార్జి ఎం.నాగరాజు, రమేష్, ఏపీయూడబ్ల్యూ జె.అధ్యక్షులు ఈ నాగరాజుగౌడ్, చిరంజీవి, శివరాజు, దస్తగిరి, విశాలాంధ్ర సిబ్బంది రంగ, శర్మ, మునిస్వామి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్‌బాష, సహాయ కార్యదర్శి శరత్ కుమార్, వెల్దుర్తి పాత్రికేయులు నివాళు లు అర్పించిన వారిలో ఉన్నారు. బంధువులు, మిత్రులు, కుటుంబ సభ్యులు మధ్య ఆయన అత్యక్రియలు నగర శివారులోని స్మశాన వాటికలో కన్నీటి వీడ్కోలు పలికారు.

వెల్దుర్తి: సీనియర్ జర్నలిస్ట్ హనుమంతు మృతికి వెల్దుర్తి మండలానికి చెందిన జర్నలిస్టులు గురువారం కర్నూలు వెంకటరమణ కాలనీ నందు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ హనుమంతు మృతి విన్న వెల్దుర్తి జర్నలిస్టులు దిగ్భ్రాంతికి గురయ్యారు. గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టులతో కలిసి పనిచేసిన జ్ఞాపకాలను నెమరు వేసుకొని చింతించడం జరిగింది. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చడం జరిగింది. వెల్దుర్తి మండల జర్నలిస్టులు మారన్న, అమీర్, ఈశ్వరయ్య, రాజు, వడ్డే అశోక్ కుమార్, ఓమేంద్ర, నజీర్, దస్తు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర – ఆస్పరి: కైరిప్పల గ్రామ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చాకలి అశోక్‌పై దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా సమితి సభ్యులు రమేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో సిఐ మస్తాన్ వలికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిందని అదే గ్రామానికి చెందిన వడ్డే మహేష్ అనే వ్యక్తి ఫీల్డ్ అసిస్టెంట్ కావాలని ఉద్దేశంతో రజకుడైన చాకలి అశోకుని కొన్ని రోజుల నుండి చంపేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. 22వ తేదీన ఉపాధి హామీ పథకం కార్యాలయంలో విధులు నిర్వహించుకొని బయటకు వస్తుండగా ఫుల్లుగా మద్యం సేవించిన వడ్డే మహేష్ అనే వ్యక్తి చాకలి అశోక్ ను నానమాటలతో దూషించి, దాడి చేసి కొట్టడం జరిగిందన్నారు. తక్షణమే దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా రజకులను సమీకరించి అందులోన కార్యక్రమాలు నిర్వహిస్తామని అయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సమాఖ్య మండల నాయకులు ఉరుకుంద, గిడ్డయ్య, వెంకటేష్, శేఖర్, ఆంజనేయ, వీరేష్, దళిత హక్కుల పోరాట సమితి మండల కార్యదర్శి రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 24, జనవరి 2025

కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన మంత్రి

విశాలాంధ్రబి - కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో ప్రభుత్వ వైద్యశాలలో అదనపు భవనాల నిర్మాణం - అత్యాధునిక పరికరాల కోసం రూ. 5 లక్షలు తన సొంత నిధుల నుంచి అందజేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం కోవెలకుంట్లలోని ప్రభుత్వ వైద్యశాలను మంత్రి సందర్శించడం జరిగింది.. ప్రభుత్వాస్పత్రిలో కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలు, సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలపై మంత్రి డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి వైద్యసాయం కోసం వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా కావాల్సిన అత్యాధునిక పరికరాలు గురించి డాక్టర్లతో మంత్రి చర్చించడం జరిగింది.. ఆస్పత్రిలో అవసరమైన మందులు, పరికరాలు, మెడికల్ కిట్‌లు వంటివి అందుబాటులో ఉంచుకోవాలని డాక్టర్లకు మంత్రి సూచించారు. ఆస్పత్రిలో వార్డుల్లో రోగుల వద్దకు మంత్రి స్వయంగా వెళ్లి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీయడం జరిగింది. అదే సమయంలో ఆస్పత్రిని పారిశుద్ధ్యంగా, ప్లాస్టిక్ రహితంగా ఉంచుకోవాలని అధికారులుకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వైద్య సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వికసిత భారత్, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధన దిశగా 20 సూత్రాలు

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంకల్పించిన వికసిత భారత్, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో 20 సూత్రాల కార్యక్రమం భాగస్వామ్యం వహిస్తుందని 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కేంద్ర ప్రాయోజిత పథకాలు మరియు ప్రాజెక్టుల అమలుపై 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంక దినకర్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 20 సూత్రాల పథకం ఛైర్మన్ ఉపాధిహామీ, జల్ జీవన్ మిషన్, పిఎంజిఎస్‌వై, పిఎంఏవై, టిడ్కో, అమృత్, పీఎం సూర్యఘర్,పిఎం కిసాన్, పిఎం స్వానిధి, నేషనల్ గోకుల్ మిషన్, తదితర పథకాల అమలును లోతుగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ లక్ష్యంగా 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశంగా తీర్చిదిద్దేందుకు సంకల్పించారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా స్వర్ణాంధ్ర సాధన -2047 లక్ష్యంగా ఒక విజన్‌తో పనిచేస్తున్నారన్నారు. వికసిత్ భారత్ లో స్వర్ణాంధ్రను భాగ్యస్వామ్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టులు, రాష్ట్రంలో అమలవుతున్న వివిధ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాల పెంపు, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా, అభివృద్దే తారక మంత్రంగా ఒక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటిని సమానంగా తీసుకుంటో ఒక స్ఫూర్తితో పని చేస్తున్నారని, 20 సూత్రాల కార్యక్రమం ఈ కార్యక్రమంలో భాగస్వామ్యంతో పని చేస్తుందని ఛైర్మన్ తెలిపారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనలో అధికారుల పాత్ర చాలా కీలకమన్నారు. వాస్తవాలు తెలిస్తేనే, పథకాల అమలు సక్రమంగా జరిగే అవకాశం ఉందని, సమీక్షలో పూర్తి వివరాలు తెలియచేయాలని ఛైర్మన్ అధికారులను కోరారు.. అంతిమంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా సమిష్టిగా పనిచేద్దామని ఛైర్మన్ అన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు పేదలకు పనులు కల్పించాలని ఛైర్మన్ అధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం 99 లక్షల పని దినాలు కాగా, ఇప్పటివరకు 70 లక్షల 43 వేల పనిదినాలు కల్పించారని, రానున్న 70 రోజులలో పెండింగ్ లో ఉన్న 29 లక్షల పని దినాలను కల్పించి లక్ష్యాలను సాధించాలని ఛైర్మన్ డ్వామా పిడిని ఆదేశించారు.ప్రధానమంత్రి గ్రామీన్ సడక్ యోజన కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఛైర్మన్ పంచాయతీ రాజ్ ఎస్ఈ ని ఆదేశించారు. పంచాయతీ రాజ్‌కి సంబంధించిన రోడ్‌లపై గుంతలను పూడ్చేందుకు నిధులను కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ ఛైర్మన్ దృష్టికి తీసుకొని రాగా ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని ఛైర్మన్ తెలిపారు.పీఎంఏవై - గ్రామీణ, అర్బన్ అమలుకు సంబంధించి ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగా 53 వేల 248 ఇళ్ళు శాంక్షన్ చేసి 38 వేల 996 ఇళ్ళు గ్రౌండ్ చేసి 21 వేల 207 ఇళ్ళు పూర్తి చేశారని వివరాలను ఇచ్చారని, ఇందులో ఎంతమంది లబ్ధిదారులు ఇంట్లో నివసిస్తునారని ఛైర్మన్ హౌసింగ్ పిడిని ప్రశ్నించారు. నివాసయోగ్యంగా ఉంటేనే ఇళ్ళు పూర్తయినట్లు పరిగణలోకి వస్తుందని ఛైర్మన్ స్పష్టం చేశారు. 2019 సంవత్సరం ముందు ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం కింద జిల్లాలో 25 వేల 624 ఇళ్ళు శాంక్షన్ కాగా 5 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని, గత ప్రభుత్వం మిగిలిన లబ్ధిదారులను పట్టించుకోలేదని ఛైర్మన్ అన్నారు.. ఎన్టీఆర్ హౌసింగ్ కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాల్సిన అవసరం ఉందని ఛైర్మన్ అన్నారు.. ఒకసారి లబ్ధిదారుడు ఎన్రోల్ అయ్యాక మరల ఇల్లు శాంక్షన్ అయ్యే అవకాశం ఉండదని, అందువల్ల వారికి న్యాయం చేయాలని ఛైర్మన్ తెలిపారు.

రీసర్వే దరఖాస్తులకు పరిష్కారం చూపాలి

విశాలాంధ్ర- బనగానపల్లె: ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో లభించిన దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం చూపాలని డోన్ డివిజనల్ రెవెన్యూ అధికారి నరసింహులు అన్నారు. గురువారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో రెవిన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గ్రామసభల్లో రెవిన్యూ సదస్సు, రి సర్వేలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. తహశీల్దార్ నారాయణరెడ్డి, ఆర్ఐ రాఘవేంద్ర, మండల సర్వేర్ గాయత్రి, వీఆర్వోలు, గ్రామ సర్వేలు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ యువగళంతో ప్రజల్లో విశ్వాసాన్ని నింపారు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పట్టణంలో పలు వార్డులలో నిర్వహించిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాణాసంచా పేల్చి కేక్ కటింగ్, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నారా లోకేష్ కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడ్డారని, ఎన్టీఆర్ మనవడిగా, చంద్రబాబు తనయుడిగా మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. నారా లోకేష్ యువగళం పాద యాత్రతో ప్రజల్లో విశ్వాసాన్ని నింపారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన విద్యా వ్యవస్థను నారా లోకేష్ గాడిలో పెడుతున్నారని, చరిత్రలో ఎన్నడు లేని విధంగా లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి తేవటంలో నారా లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని, వారసత్వం పేరుతో వ్యవస్థలను తప్పుదోవ పట్టించ కుండా ఒక సిస్టంతో ముందుకు వెళుతున్న నాయకుడు నారా లోకేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, టిడిపి వార్డు ఇన్చార్జిలు, వార్డు ప్రెసిడెంట్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోండి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని గ్రామాలలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ కోరారు. గురువారం మండలంలోని గొడెగనూరు గ్రామంలో పశు వైద్యులు సాయిబాబా, పెద్దవంగలిలో పశువైద్యులు దీపాకుమారిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ చికిత్సలు, నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు వేసి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో విఎల్‌ఓలు జమాల్‌వలి, మురళి మోహన్, గోపాలమిత్ర వీరయ్య, ఏహెచ్‌ఏలు రైతులు పాల్గొన్నారు.

ఆలమూరు చేరిన అహోబిలేసుడు

విశాలాంధ్ర- రుద్రవరం: మండలంలోని ఆలమూరు గ్రామంలో అహోబిల లక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవ మూర్తులు గురువారం కొలువుదీరారు. బుధవారం సాయంత్రం స్వామివారి ఉత్సవ పల్లకి గ్రామ పొలిమేరలోకి రాగానే గ్రామ పెద్దలు మేళా తాళాలతో స్వామివారి పల్లకికి ఎదురేకి గ్రామంలోకి ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి పల్లకి గ్రామంలో ఎంపిక చేసిన తెలుపులపై ఉత్సవ పల్లకి కొలువు దీరడంతో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

క్రికెట్ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

విశలాంధ్ర- కోసిగి: సూర్య మెమోరియల్ సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా ఆర్గనైజింగ్ టీమ్ కేవల్ 11 క్రికెట్ క్రీడాకారులకు దుస్తులు శ్రీ రేణుక కేఫ్ ప్రొప్రైటర్ పూజారి చందు జెర్సీలను స్పాన్సర్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చందు మాట్లాడుతూ క్రీడాకారులు ఆటలో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాల న్నారు. భవిష్యత్తులో క్రీడాకారులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రమేష్, ఆర్గనైజింగ్ టీం సభ్యులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించకపోతే ఉద్యమమే

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఉద్యోగ,ఉపాధ్యాయుల మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించకపోతే ఎస్టియు ఆధ్వర్యంలో ఉద్యమము చేపడతామని ఎస్టియు రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్,పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి,భీమరాజు హెచ్చరించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఎస్టీ పట్టణ అధ్యక్షులు రవి అధ్యక్షతన ఎస్టీయు పట్టణ సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రభుత్వం మౌనం వీడి పరిష్కరించే దిశలో కృషి చేయాలని డిమాండ్ చేశారు. 11వ వేతన సవరణ గడువు ముగిసిన 16 నెలలు కావస్తున్న 12వ వేతన సవరణ ఊసే పోయిందని ఆగ్రహ వ్యక్తం చేశారు. వేతన సవరణ కమిటీకి ఛైర్మన్ ను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు గోడు వినే అవకాశం ప్రభుత్వం కల్పించకుండా కాలయాపనా చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎన్నికల ముందు సమస్యలు పరిష్కరిస్తామని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక నిమ్మకు నిరత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. సిపిఎస్ రద్దు హామీ వంటి ప్రధాన అంశాలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. వెంటనే ఉద్యోగ ఆర్థిక బకాయిలు మంజూరు చేయాలని కోరారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రహల్లాద, ప్రసాద్, సుధాకర్, విజయరామ్, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంగళదాల్‌లో స్కూల్ కాంప్లెక్స్ కొనసాగించాలి

విశాలాంధ్ర - హెూళగుంద: మండలంలోని ఇంగళదహాల్ జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ కొనసాగించాలని గురువారం పాఠ శాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ లు ఉరుకుందు, కొండయ్య, సునీత డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ వల్ల ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఎంతో ఉపయోగముందని అన్నారు. ఏడు ఎకరాల విస్తీర్ణంలో 1964లో హైస్కూల్ ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యాబోధన కలుగుతుందని అన్నారు. గ్రామంలో పోస్ట్ ఆఫీస్ ఏర్పడిందని దీనివల్ల అనేక గ్రామాల ప్రజలకు పోస్టల్ సౌకర్యం అందుతుందని, హాస్టల్ ఇతర సదుపాయాలు ఉన్న గ్రామానికి స్కూల్ కాంప్లెక్స్ లేకుండా పోవడం ఆశ్చర్యకరంగా ఉన్నదని ఆవేదన చెందారు. ఎంఈఓ ప్రమేయంతో స్కూల్ కాంప్లెక్స్ రాకుండా పోయిందని ఆరోపించారు. స్కూల్ కాంప్లెక్స్ పై హెడ్మాస్టర్, ఉపాధ్యాయులతో చర్చించామని స్కూల్ కాంప్లెక్స్ మంజూరు కాకపోతే ప్రజలతో ప్రభుత్వ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు రఫీ క్, మహానంది, వంపాపతి, రాజు, ఇబ్రహీం, ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున పాల్గొన్నారు

స్కూల్ కాంప్లెక్స్ రద్దు విషయంలో తన పాత్ర లేదు

ఇంగలదహాల్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో స్కూల్ కాంప్లెక్స్ రద్దు విషయంలో తన పాత్ర ఏమీ లేదని ఎంఈఓ సత్యనారాయణ అన్నారు. గురువారం మాట్లాడుతూ గత 15 ఏళ్ల నుండి హెబ్బటం హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్స్ జరుగుతుం దని, డిఈఓ ఆదేశాల మేరకు తాను నడుచుకున్నానే తప్ప స్కూల్ కాంప్లెక్స్ రద్దులో తన ప్రమేయం ఉందంటూ ఆరోపించడం తగదన్నారు. తాను తప్పు చేసి ఉంటే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళచ్చని, నిబంధన ప్రకారమే నడుచుకు న్నానన్నారు. స్కూల్ కాంప్లెక్స్ రద్దుచేసి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బంది పెట్టే ఉద్దేశం తనది కాదన్నారు.

కేరింతలు, ఉత్సాహంతో నంది బాలోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జిల్లా కేంద్రంలో నంది బాలోత్సవాలు ఉత్సాహ భరితాంగా, కేరింతలు కేకల మధ్య ఉల్లాసంగా జరిగాయి. రెండు రోజులపాటు నిర్వహించిన నంది బాలోత్స వాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వివిధ పాఠశాలలకు చెందిన 5వేల మంది విద్యార్థులు రెండు రోజులపాటు పలు రకాల ప్రదర్శనలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. రెండవ రోజు జరిగిన నంది బాలోత్సవాలలో ఫ్యాన్సీ డ్రెస్, క్లాసికల్ డాన్స్, జానపద నృత్యము, దేశభక్తి గీతాలు, జానపద గీతాలు, కోలాటం, మట్టితో బొమ్మలు తయారీ, స్పెల్బీ, మ్యాప్, క్విజ్, మెమోరి టెస్ట్,తెలుగు, ఇంగ్లీష్ లో ఉపన్యాసం, పద్యం, పద్యభావం తదితర కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభకను కనపరిచారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఇఓ పి. జనార్దన్ రెడ్డి, ఇండస్ ఆసుపత్రి ప్రముఖ వైద్యులు కార్డియాలజిస్ట్ డాక్టర్ క్రాంతి చైతన్య వలువురు చేతుల మీదుగా మెమొంటోలు, ప్రశంసపత్రాలు అందజేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి పి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా నంది బాలోత్సవాలు ఉండబోతున్నాయని పేర్కొన్నారు.నంద్యాల జిల్లాలో కనివిని ఎరగని రీతిలో నంది బాల ఉత్సవాలు రెండు రోజులపాటు జరిగాయని, ఎంతోమంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. జిల్లాకే గర్వకారణంగా ఉందని, బయట ఉన్న విద్యార్థులు కూడా ఈ కార్యక్రమం ద్వారా ఉత్తేరణ చెంది భవిష్యత్తులో ఎక్కువమంది విద్యార్థులు పాల్గొనడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నంది బాలోత్సవాల నిర్వాహకులు శంకరయ్య,మౌలాలి,భాస్కర్ రావు,లక్ష్మణ్, ప్రసాద్ గోపాల్, ఎం ఆర్ నాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో నారా లోకేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ, తాలూకా యువ నాయకులు భూమా జగత్ విక్యాత్ రెడ్డి, భార్గవరామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి లోకేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ యువగళం కార్యక్రమం ద్వారా రాష్ట్రాన్ని ఏకం చేసి పార్టీ గెలుపు కోసం లోకేష్ ఎంతో కష్టపడ్డారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలో తేస్తూ నిరుద్యోగులకు ఉపాధి చూపిస్తున్నారన్నారు. కష్టపడి తండ్రికి తగ్గ తనయుడుగా నిరూపించారన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో కీలకం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ యాదవ్, హర్షవర్ధన్ రెడ్డి, చక్రి తదితరులు ఉన్నారు.

ప్రతిభ హై స్కూల్ నందు ఘనంగా నేతాజీ జయంతి

విశాలాంధ్ర - కౌతాళం: ఆజాద్ హింద్ ఫౌజ్ను స్థాపించిన భారత స్వాతంత్ర్య సమర యోధుడు, సాయుధ పోరాట వీరుడు, ఓటమి ఎరుగని వ్యక్తిత్వంతో మాతృభూమి సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహా నేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకను ఘనంగా ప్రతిభ హై స్కూల్ నందు ఘనంగా నిర్వహించారు. ముందుగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్ నేతాజీ గురించి మాట్లాడుతూ నేతాజీ దేశ స్వాతంత్రం కోసం యుక్త వయసులోనే సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని దానికి ఆజాద్ హింద్ ఫౌజ్ అని పేరు పెట్టి బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసిన మహావీరుడు గొప్ప ధైర్యశాలి కావున ప్రతి విద్యార్థి సమాజ శ్రేయస్సు కొరకు, దేశ రక్షణ కొరకు క్రమశిక్షణ నైతిక విలువలతో విద్యనభ్యసించి ఒక సైనికుడు వలె సమాజాభివృద్ధి కొరకు ముందడుగు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నేతాజీ, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు, రుద్రమదేవి, ఝాన్సీ కి రాణి, ఇందిరా గాంధీ ఇలాంటి గొప్ప గొప్ప వారిని ఆదర్శంగా తీసుకొని, ప్రస్తుతం మిలటరీ, నావిక దళం, బిఎస్ఎఫ్, లాంటి సంస్థలలో యువతకు మంచి అవకాశాలు ఉన్నాయని అలాంటి వాటిని సద్వినియోగం చేసుకొని దేశ రక్షణకు తమ వంతు కృషి చేయాలని విద్యార్థులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, జయలక్ష్మి, శిరీష,, మమ్ముతాజ్, రాజు, భీమేష్, ఖాజా పీర్, సీనియర్ ఈరన్న, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వొకేషనల్ కళాశాలలో నేతాజీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బి-క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం నాడు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ 129వ జయంతి సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్, అధ్యాపకులు నేతాజీ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనమైన నివాళులర్పించారు. భారత స్వాతంత్ర సమర వీరులలో అగ్ర గణ్యుడు, అలుపెరుగని పోరాటంతో ఓటమి ఎరుగని వ్యక్తిత్వంతో మాతృభూమి సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత సుభాష్ చంద్ర బోస్ అని ప్రిన్సిపల్ ఎస్.నాగస్వామి నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాశక్తి సంపాదకులు యల్లాగౌడ్, కళాశాల లెక్చరర్స్ రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, పార్థసారథి పటేల్, సోమేష్, ఉల్గోజి రావు, చిన్న మల్లేశ్వరుడు, నాన్ టీచింగ్ సిబ్బంది భాస్కర్, సత్యానందం, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

నేషనల్ హైవే అధికారులు పంట పొలాలకు రహదారులు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు: పట్టణంలోని, నందికొట్కూరు పొలిమేర వీపనగండ్ల గ్రామ పొలిమేరలోని పంట పొలాలకు రహదారులు లేనందున రైతులు తీవ్రంగా నష్టపోతు ఉన్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రైతులు హైవే రోడ్డు నందు గురువారం రాస్తారోకో నిర్వహించి నిరసన తెలియజేయడం జరిగింది .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై నరసింహులు మాట్లాడుతూ హైవేకు లింకు రోడ్స్ లేనందున రైతులు పండించిన వేల ఎకరాల పంటలను వారి నివాసానికి చేర్చుకోవాలంటే తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. హైవే రోడ్డు నుంచి రైతులకు రహదారులు ఏర్పాటు చేయాలని గతంలో రైతులు అనేకసార్లు ఆందోళన చేసి జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకుపోయిన హైవే కాంట్రాక్టర్ అయినా పిఎస్కే కంపెనీ యాజమాన్యాన్ని దృష్టి తీసుకుపోయిన నేటికీ రహదారులు ఏర్పాటు చెయ్యలేదని, పైగా రహదారులు నిర్మాణం చేయనందువలన రైతులు తీవ్రమైన బాధలకు గురవుతున్న రైతుల పట్ల ఏమాత్రం కనికరం చూపకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం కొరకు నందికొట్కూరు పొలిమేరలో దాదాపు ఎకరం రెండు కోట్ల 50 లక్షల రూపాయలు విలువగల భూములను కోనేరు రంగారావు సిఫారసుల మేరకు నష్ట పరిహారం చెల్లించకుండా హైవే రోడ్ల నిర్మాణం కోసం రైతులకు కేవలం ఎకరం 14 లక్షల 6000 వేలు రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకోవడం జరిగిందన్నారు. మరోపక్క రోడ్డు నిర్మాణం కొరకు ఎటువంటి మైనింగ్ పర్మిషన్ లేకున్నప్పటికీ రైతులకు ఆర కొరగా డబ్బులు ఇచ్చి వ్యవసాయ పంట పొలాలను ధ్వంసం చేసి మట్టిని తరలించడం జరిగిందని ,ఇంత త్యాగానికి ఒడికట్టిన రైతాంగానికి రహదారులు నిర్మించక పోవడం చాలా బాధాకరమని కావున రైతుల పంటలను తమ నివాసానికి పోయే విధంగా రైతులకు రహదారులు ఏర్పాటు కోసం నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి అమ్మ మరియు నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయ సూర్య జోక్యం చేసుకొని రహదారణ నిర్మాణం కొరకు వారు కృషి చేయాలని కోరారు. రైతులకు సంఘీభావంగా ఐఎఫ్ టియు జిల్లా అధ్యక్షులు పి.మజీద్ మియా, గోపాల్, రైతులు చామంతి భాస్కర్, లోకేశ్వర్ రెడ్డి, మురళీమోహన్ రెడ్డి, సురేంద్ర రెడ్డి చంద్రశేఖర్ గౌడ్, పుల్లారెడ్డి, రామకృష్ణ గౌడ్, రఘు స్వామి రెడ్డి తదితరులు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: విద్యార్థులు వర్సిటీ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సులర్ ఆచార్య ఎన్‌టికె నాయక్ పిలుపునిచ్చారు. స్పెక్ట్రమ్ పబ్లికేషన్స్, హైదరాబాదు అధినేత ఎస్. మోహన్ నాయుడు ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపయోగపడే రూ.7 లక్షల విలువైన పుస్తకాలను యూనివర్సిటీ లైబ్రరీకి బహూకరించారని ఆయన తెలిపారు. 10 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు 3 లక్షల విలువైన పుస్తకాలను వ్యక్తిగతంగా అందించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి పాణ్యం శాసనసభ్యులు గౌరుచరితారెడ్డి, కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి, నందికొట్కూరు శాసనసభ్యులు గిత్తా జయసూర్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర ఐటి, విద్యాశాఖమంత్రి నారాలోకేష్ జన్మదినం సందర్భంగా విశ్వవిద్యాలయంలో పుస్తకాలపంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన స్పెక్ట్రమ్ పబ్లికేషన్స్ యాజమాన్యాన్ని పాణ్యం శాసనసభ్యురాలు గౌరుచరితారెడ్డి ప్రశంసించారు. వర్సిటీ బోధనా సిబ్బందితోపాటు, బోధనేతర సిబ్బంది, నాగరాజు, హుసేనయ్య, మాధవ శేఖర్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: గురువారం ఉదయం కర్నూలు మెడికల్ కళాశాల విద్యార్థులు ఆవరణంలో మెడికల్ కళాశాల విద్యార్థులు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ మెడికల్ కళాశాల విద్యార్థులు, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పర్యవేక్షకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముందుగా కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, పని ప్రదేశంలో, చదువుకునే ప్రదేశంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలని కోరారు. తర్వాత జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే వ్యక్తుల ఆరోగ్యం కూడా బాగుంటుందని తద్వారా సమాజము కూడా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు,అధ్యాపకలు, కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో చంద్రబోస్ జయంతి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : భారతీయ జనతా పార్టీ, నంద్యాల జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు మాట్లాడుతూ 1887 జనవరి 23న కటక్‌లో ఒక సంపన్న కుటుంబంలో జన్మించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇండియన్ సివిల్ సర్వీస్ ఉద్యోగం విడిచిపెట్టి దేశ స్వతంత్రం కోసం కదన రంగంలోకి దూకిన ధైర్యశాలి అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కసెట్టి చంద్రశేఖర్, ఇనుగురి రమేష్ బాబు, లక్ష్మి రెడ్డి, ఉపేంద్రనాథ్ రెడ్డి, గోస్పాడు మండల అధ్యక్షుడు మధు గోపాల్, బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రమల బాలముని, యూత్ నాయకుడు వంశీ గౌడ్, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైపర్‌లో ఘనంగా చంద్రబోస్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్: నగరంలోని ఏ క్యాంపు నందుగల మైపర్ ఫార్మసీ కళాశాల యందు గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రను స్వాతంత్రం కోసం ఆయన చేసిన పోరాటాన్ని ఆయన జన్మదినాన్ని గవర్నమెంట్ పరాక్రమ దివస్ గా దివస్క నిర్వహించడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కోదాది మహాలక్ష్మి. వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కాసర్ల సురేష్. డాక్టర్ రాజ్ కుమార్ రఘువీర్ మొదలగు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేతాజీ ఆశయాల స్ఫూర్తి కొనసాగించాలి

విశాలాంధ్ర -పత్తికొండ: భారతదేశ స్వాతంత్ర్యం, ఐక్యత కోసం పోరాడిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాల స్ఫూర్తిని కొనసాగించాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగస్వామి, మహేష్, సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, మైరాముడు, సత్యనారాయణ లు అన్నారు. సుభాష్ చంద్రబోస్ 128 వ జయంతిని గురువారం స్థానిక న్యాయవాదుల సంఘం కార్యాలయంలో నేతాజీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారానే స్వరాజ్యం వస్తుందని నమ్మిన విప్లవ మార్గంతో నేతాజీ సుభాష్ చంద్రబోస్ బ్రిటీష్ వారిపై పోరాడారని కొనియాడారు. జైహింద్ నినాదం తో దేశ యువత లో స్ఫూర్తి రగిలించారన్నారు. అజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుడని వారు కొనియాడారు. న్యాయవాదులు రవికుమార్, మల్లికార్జున, నరసింహ ఆచారి, నాగేష్, లక్ష్మన్న, దామోదర్ ఆచారి, జటంగిరాజు, ప్రసాద్ బాబు, నారాయణ స్వామి, మునెయ్య, నెట్టేకల్లు పాల్గొన్నారు.

తుంబలబీడులో చంద్రబోస్ వేడుకలు

విశాలాంధ్ర -ఆలూరు: ఆలూరు మండలం తుంబలబీడు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర సమరయోధుడు భారతదేశ గొప్ప నాయకుడు సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నాగరాజ్ మాట్లాడుతూ బానిస సంకెళ్లలో నలిగిపోతున్న ఈ దేశం అడుక్కోవడం వల్లనో లేక బ్రతిమలాడడటం వల్లనో స్వేచ్ఛ సంపాదించలేదని, పోరాటం చేసి ఆ సంకెళ్లని ఈ దేశ ప్రజలు తెంచుకోవాలన్న సందేశాన్ని భారత పౌరులకి సూటిగా అందజేగలిగింది ఈ నినాదమే, అని విద్యార్థులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రమణారెడ్డి, సూర్యనారాయణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.